ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# ముదిగంటి సుజాతారెడ్డి రచించిన 'మన తెలుగు సాహిత్య చరిత్ర' - పరిచయం

కావలి రాఘవేందర్

పరిశోధక విద్యార్థి,తెలుగు శాఖ,ఉస్మానియా విశ్వవిద్యాలయం

Article Received: 02/01/2025 Article Accepted: 31/01/2025 Published Online: 02/02/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2107

**ఉపోద్ఘాతం** :తెలుగు సాహిత్యంలో 19 వ శతాబ్దం మొదలుకొని ఇప్పటివరకు వివిధ రకాల సాహిత్య చరిత్రలు వెలువడ్డాయి. ఇప్పటికీ కొత్త కొత్త మార్పులతో సాహిత్య చరిత్రలు వస్తున్నాయి. ఒక సాహిత్య సాహిత్య చరిత్రకు మరొక సాహిత్య చరిత్రకు మధ్య భిన్న తేడాలు ఉంటాయి. సాహిత్య చరిత్రలు ఆయా సాహిత్య చరిత్ర రచయితల దృష్టి కోణం ఆధారంగా రచింపబడ్డాయి. అందులో ఒక గ్రంథమే 'మన తెలుగు సాహిత్య చరిత్ర'.

మన తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాన్ని ముదిగంటి సుజాతారెడ్డి 2018లో రచించారు. ఈ గ్రంథాన్ని చారిత్రక, సామాజిక కోణంలో రచించారు. ఈ గ్రంథాన్ని తెలంగాణ తెలుగు అకాడమీవారు 2016-17 విద్యా సంవత్సరం నుంచి బి.ఏ. మొదటి సంవత్సరం, మొదటి సెమిస్టర్, రెండవ సెమిస్టర్ చదివే విద్యార్థుల కోసం ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం(CBSC) పాఠ్యప్రణాళిక ప్రకారం ఈ గ్రంథాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ గ్రంథానికి విషయ నిపుణులుగా శ్రీరంగాచార్య, కసిరెడ్డి వేంకటరెడ్డి, పిల్లలమర్రి రాములు, కాలువ మల్లయ్య వంటివారు ఉన్నారు. గౌరవ సంపాదకులుగా ఏ. సత్యనారాయణ రెడ్డి, సంపాదకులుగా ముదిగంటి సుజాతారెడ్డి ఉన్నారు. మన తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంలో ముదిగంటి సుజాతారెడ్డి పేర్కొన్న అంశాలను ఈ వ్యాసం ద్వారా తెలుసుకోవచ్చు.

**కీలకాంశాలు** : 'మన తెలుగు సాహిత్య చరిత్ర' ప్రత్యేకత మరియు మౌళికాంశాలు.

**ముదిగంటి సుజాతారెడ్డి పరిచయం** : ముదిగంటి సుజాతారెడ్డి 1942 మే 25వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా, నకిరేకల్ మండలం ఆకారం గ్రామంలో జన్మించారు. ఈమె తల్లి వెంకటమ్మ, తండ్రి రాంరెడ్డి. వీరిది దొరల కుటుంబం. ముదిగంటి సుజాతారెడ్డి వారి తల్లిదండ్రులకి రెండవ సంతానం. చిన్నతనం నుండి ఆమెపై కమ్యూనిస్టు ఉద్యమాల ప్రభావం ఎక్కువగా ఉంది. కమ్యూనిస్టు ఉద్యమాల వలన

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఆంధ్ర ప్రాంతానికి వలస వెళ్ళిన వీరి కుటుంబం కొంతకాలం గుంటూరు, అద్దంకి, నరసరావుపేట ప్రాంతాలలో నివసించారు. 1948లో తెలంగాణ రాష్ట్ర విమోచనం జరిగిన తర్వాత కమ్యూనిస్టు పోరాటాలలో ఉధృతి తగ్గింది. అప్పుడు వీరి కుటుంబం మళ్ళీ తెలంగాణ ప్రాంతానికి వచ్చి నల్లగొండలో స్థిరపడ్డారు. ముదిగంటి సుజాతారెడ్డికి బాల్యం నుండి ఇంట్లో సాహిత్య వాతావరణం తక్కువగా ఉండేది. ఖండవల్లి లక్ష్మీరంజనం రచించిన “ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం” చదవడం ద్వారా సాహిత్య పరిచయం ఏర్పడింది అని రచయిత్రి తమ ఆత్మకథ లో పేర్కొన్నారు.

**విద్యాభ్యాసం:** ముదిగంటి సుజాతారెడ్డి 1950వ సంవత్సరంలో నల్లగొండలో ప్రాథమిక విద్యను ప్రారంభించారు. 1956లో హైదరాబాదులోని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి మహిళా కళాశాలలో పి.యు.సి. (ప్రీ యూనివర్సిటీ కోర్సు)లో ప్రవేశం పొందారు. నల్లగొండలోని నాగార్జున కళాశాలలో బి.ఏ. మొదటి సంవత్సరం పూర్తి చేశారు. 1959లో గోపాల్ రెడ్డితో వివాహం జరిగింది. వివాహ అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కళాశాలలో బి.ఏ. రెండవ సంవత్సరంలో ప్రవేశం పొంది, అదే కళాశాలలో యం.ఏ. పూర్తి చేశారు. ముదిగంటి సుజాతారెడ్డి.1976లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి “మను-వసు చరిత్రల తులనాత్మక పరిశీలనం” అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్డీ పట్టాను పొందారు.

**ఉద్యోగ జీవితం:** యం.ఏ. పూర్తి చేసిన తర్వాత నృపతుంగ మల్టీపర్పస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. వివాహం తర్వాత 1966లో సుజాతారెడ్డి భర్త గోపాల్ రెడ్డికి జర్మనీలోని ట్యూబింగేన్ విశ్వవిద్యాలయంలో జర్మన్ భాషలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడానికి అవకాశం వచ్చింది. భర్తతో పాటు ఆమె కూడా జర్మనీ వెళ్ళి అక్కడి ట్యూబింగన్ విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో ఓరియంటల్ విభాగంలో భారత అధ్యయన గ్రంథాలను సబ్జెక్టు క్యాటలాగ్ చేయడంలో సేవలు అందించారు. అక్కడ సేకరించిన సమాచారంతో “సంస్కృత సాహిత్య చరిత్ర”ను రచించారు.

1969లో జర్మనీ నుంచి భారతదేశం తిరిగి వచ్చారు. తర్వాత మేక్స్ ముల్లర్ భవనంలో లైబ్రేరియన్ గా కొంతకాలం పని చేశారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం మహిళా కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్ గా కొంతకాలం పనిచేశారు. ముదిగంటి సుజాతారెడ్డి 2000 సంవత్సరంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పదవి విరమణ పొందారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సిలబస్ కమిటీలో సలహాదారుగా, పాఠశాల టెక్స్ట్ బుక్ కమిటీలో సభ్యురాలిగా, తెలంగాణ సారస్వత పరిషత్తులో ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు. ఇప్పటివరకు వీరి రచనలపై ఒక పి.హెచ్.డి సిద్ధాంత గ్రంథం, రెండు ఎం.ఫిల్ పరిశోధన వ్యాసాలు

వచ్చాయి. సుజాతా రెడ్డి రాసిన కొన్ని నవలలు, కథలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదించబడ్డాయి.

**ముదిగంటి సుజాతారెడ్డి రచనలు**

**1. సాహిత్య విమర్శ గ్రంథాలు :**

*మను – వసు చరిత్రల తులనాత్మక పరిశీలన – 1977, *శ్రీనాథుని కవితా సౌందర్యం – 1980, *బాణుని కాదంబరి పరిశీలన – 1980, *వేమన నాథసంప్రదాయం – 1993, *తెలుగు నవాలానుశీలనం -1991, *ముద్దెర – 2005, *రస చర్చ – ఆధునికత – 2010, *అద్యతన దృష్టి – 2014

**2. సాహిత్య చరిత్రలు:**

*సంస్కృత సాహిత్య చరిత్ర – 1986, *ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర – 1989, *చారిత్రక సామాజిక కోణంలో తెలుగు సాహిత్య చరిత్ర – 1996, *తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర – 2015, *మన తెలుగు సాహిత్య చరిత్ర – 2018

**3. నవలలు:**

*మలుపు తిరిగిన రథ చక్రాలు – 1994, *సంకెళ్ళు తెగాయి – 1994, *ఆకాశంలో విభజన రేఖల్లేవు – 1995

**4. కథాసంపుటాలు:**

*విసుర్రాయి – 1998, *మింగుతున్న పట్నం – 2001, *వ్యాపారం మృగం – 2005, *మరో మార్క్స పుట్టాలే – 2010, *నిత్య కల్లోలం – 2017

**5: సంపాదకత్వం**

*తెలంగాణ తొలి తరం కథలు – 2002 , *తొలి నాటి కథలు – 2005, *జైలు లోపల కథలు – 2009, *నూరేళ్ళ తెలుగు కథలు – 2010, *ఇల్లిందల సరస్వతీదేవి ఉత్తమ కథలు – 2016, *తెలంగాణ రచయిత్రుల కథలు – 2017, *వ్యాపార సంస్కృతిలో స్త్రీ చైతన్యం

**6: యాత్రా చరిత్రలు**

*నైలునది నాగరికత (ఈజిప్ట్ యాత్రా కథనం) – 2006, *లద్దాక్ యాత్రా కథనం – 2015, *అద్భుత చైనా యాత్ర – 2015

**7: ఆత్మకథ**

*ముసురు (అనుభవాలు – జ్ఞాపకాలు – ఆలోచనలు) – 2010

**8: నిఘంటువు**

*తెలంగాణ వ్యవహార పదకోశం – 2018

**9: స్మృతి కావ్యం**

*ముదిగంటి గోపాల్ రెడ్డి (జీవితం – వ్యక్తిత్వం- పాండిత్యం) – 2005

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**10: మోనోగ్రాఫ్**

*భారతీయ సాహిత్య నిర్మాతలు – వాసిరెడ్డి సీతాదేవి - 2016

**సాహిత్య చరిత్ర పరిచయం:** తెలుగు సాహిత్యానికి దాదాపు వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. అప్పటి నుండి సాహిత్యం వివిధ రూపాలలో వెలువడింది. కవుల సాహిత్యాన్ని, వారి జీవన విధానాన్ని, సాంస్కృతిక అంశాలను వివరించే గ్రంథాలను 'సాహిత్య చరిత్రలు' అని పేర్కొనవచ్చు. తెలుగు భాషలో వెలువడిన సాహిత్య సమాచారం అంతా ఒక చోటికి చేర్చబడలేదు. ఒకవేళ చేర్చబడింది అనుకున్నప్పటికీ ఆ సమాచారం ప్రస్తుతం అలభ్యం. మొట్ట మొదట ఆ ప్రయత్నం చేసిన వ్యక్తి కావలి వెంకట రామస్వామి. ఇది తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణానికి అంకురార్పణగా చెప్పవచ్చు. కానీ ఆ ప్రయత్నం ఆంగ్ల భాషలో జరిగింది. తెలుగులో వచ్చిన సాహిత్య చరిత్రలలో కావలి వెంకట రామస్వామి 1829వ సంవత్సరంలో రచించిన "దక్కను కవుల చరిత్ర (Biographical Sketches of Deccan Poets)" తో సాహిత్య చరిత్ర ప్రక్రియ ప్రారంభమైంది.

గురజాడ శ్రీరామమూర్తి రచించిన "కవి జీవితములు"గ్రంథం తెలుగు భాషలో వచ్చిన మొదటి కవుల చరిత్ర. ఈ రచన 1876 నుండి 1882 మధ్యకాలంలో నాలుగు భాగాలుగా వెలువడింది. అనంతరం 1893వ సంవత్సరంలో నాలుగు భాగాలతో కలిపి సమగ్ర సంపుటంగా వెలువడింది. ఇది గ్రాంధిక శైలిలో ఉంది. ఇందులోని కవులను కావ్య ప్రక్రియల ఆధారంగా విభజించారు. 1. భారతాంధ్ర కవులు 2. రామాయణాంధ్ర కవులు 3. ద్వ్యర్థి కావ్యకవులు 4. ప్రౌఢ ప్రబంధ కవులు 5. పురాణ కవులు. 'కవి జీవితములు' రచనలో క్రీ.శ. 10వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకు ఉన్న 24 మంది కవుల చరిత్రలు పొందుపరచబడ్డాయి. కందుకూరి వీరేశలింగం పంతులు(ఆంధ్ర కవుల చరిత్రము) తర్వాత వెయ్యేళ్ళ సాహిత్యంలో అనేక మంది దాదాపు సాహిత్య చరిత్రలు రాశారు.

**మన తెలుగు సాహిత్య చరిత్ర:** ముదిగంటి సుజాతారెడ్డి రెండు సాహిత్య చరిత్రలను రచించారు. 'ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర' – 1989 లో రచించారు. కొన్ని మార్పులతో ఈ గ్రంథాన్ని 2018 లో మన తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంగా తీసుకువచ్చారు. "మన తెలుగు సాహిత్య చరిత్ర" గ్రంథాన్ని ముదిగంటి సుజాతారెడ్డి 19 భాగాలుగా వర్గీకరించారు. ఈ వర్గీకరణ మొత్తం చారిత్రక, సామాజిక నేపథ్యాల ఆధారంగా చేయబడింది. ఇందులో సంస్కృత కవులకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు. 'మన తెలంగాణ సాహిత్య చరిత్ర' గ్రంథాన్ని ఈ క్రింది విధంగా వర్గీకరించి రచించారు.

1. తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం, 2. ఆరంభం, 3. పూర్వయుగం, 4 జైనకవుల యుగం, 5. నన్నయ యుగం, 6. శివకవుల యుగం, 7. తిక్కన యుగం, 8. ఎర్రన యుగం, 9. శ్రీనాథ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

యుగం, 10. శ్రీకృష్ణదేవరాయల యుగం, 11. కుతుబ్ షాహీల యుగం, 12. రఘునాథ నాయక యుగం, 13. వీరేశలింగం యుగం, 14. కృష్ణశాస్త్రి యుగం, 15. శ్రీశ్రీ యుగం, 16. అభ్యుదయానంతర ధోరణులు-వాదాలు, 17. విప్లవ వాదం, 18. విప్లవానంతర ధోరణులు-అస్తిత్వ వాదాలు, 19. ప్రపంచీకరణం - వ్యాపార యుగం - అత్యాధునిక ధోరణులు అనే విభాగాలుగా విభజించి, ఆయా కాలాలలోని చరిత్ర వివరాలు, కవుల, సాహిత్య అంశాలను వివరించారు.

"మన తెలుగు సాహిత్య చరిత్ర"లో కవుల పేర్లతో యుగ విభజన చేశారు.(ఆయా కాలాల్లో కవి పోషకుల ఆధారంగా కృష్ణదేవరాయలు, రఘునాథ నాయకుని యుగాలుగా వర్గీకరించారు, పాండిత్యం నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు వంటి వారిని కావ్యాల ఆధారంగా యుగ విభజన చేశారు. అంతేకాదు ఆయా యుగాల్లోని కవితోద్యమాలకు ప్రతినిధులుగా, నాయకులుగా ఉన్న వీరేశలింగం, కృష్ణ శాస్త్రి, శ్రీశ్రీని సాహిత్య చరిత్రలో యుగకర్తలుగా సుజాతారెడ్డి పేర్కొన్నారు. యుగకర్త అయిన కవి ఆ యుగాన్నంతటిని ప్రభావితం చేసి, ఆ యుగంలోని కవులకు స్ఫూర్తినిచ్చి ఆదర్శంగా నిలచేవాడై వుండాలని సుజాతారెడ్డి భావించారు. పోతన ప్రతిభ గల కవి అయినా అతని కాలం శ్రీనాథుని యుగంగానే పేర్కొన్నట్లు చెప్పారు. కాల్పనికతతో కూడిన భావ కవితా లక్షణమంతా కృష్ణశాస్త్రిలో ప్రతిఫలిస్తుంది. అందుకే ఆ కాలానికి కృష్ణశాస్త్రియుగం అని చెప్పారు.

గురజాడనో, రాయప్రోలునో యుగకర్తగా చేస్తే ఆ యుగ లక్షణం పూర్తిగా ప్రతిఫలించదు అని సుజాతారెడ్డి భావించారు. రాయప్రోలు భావ కవులకు ఆదర్శంగా నిలిస్తే, గురజాడ అభ్యుదయ కవులకు ఆదర్శంగా నిలిచాడు. కాబట్టి ఆ మహానుభావులను నవ్య కవితోద్యమానికి మూలవిరాట్టులుగా నవ్యరీతులను, నూతన ప్రమాణాలను సృష్టించి ఇచ్చిన గురువులుగా స్వీకరిస్తే బాగుంటుందని అభిప్రాయపడినట్లు తెలుస్తుంది.

**తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం:** తెలంగాణ సాహిత్య ప్రత్యేకతను ఆంధ్ర సాహిత్య పరిచయంలో భాగంగానే పేర్కొన్నారు. కానీ సుజాతారెడ్డి తెలంగాణ శీర్షికలో ప్రత్యేకంగా తెలంగాణ ప్రత్యేకతను వివరించారు. తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం విభాగంలో తెలంగాణ సాహిత్య చరిత్ర ఆరంభ వికాసాలను, ఆధునిక కాలం వరకు వచ్చినటువంటి సాహిత్య చరిత్రలోని ప్రముఖ అంశాలను పరిచయం చేశారు.

**జైన కవుల యుగం:** తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలలో జైనమతం క్రీస్తుపూర్వం నుండి ఉంది. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలోనే దక్షిణ భారతదేశంలోకి జైనమతం వ్యాపించింది. వేములవాడ చాళుక్యుల పరిపాలనలో జైనమత కేంద్రంగా వేములవాడ విలసిల్లింది. ఆ

కాలంలో తెలంగాణ ప్రాంతంలో పొట్ల చెరువు(ప్రస్తుతం పఠాన్ చెరువు), కొలనుపాక, గంగాధర, వర్ధమానపురం, వేములవాడ వంటి ప్రాంతాలలో జైన వస్తువులు ఉన్నట్లు చారిత్రక ఆధారాల వలన తెలుస్తుంది. జైన కవుల యుగానికి చెందిన వేములవాడ భీమకవి ద్రాక్షారామ ఆలయ ప్రాంతంలో జీవించినట్లు, అతని తండ్రి భీమేశ్వర ఆలయ పూజారి అని కొంతమంది పేర్కొన్నారు. కానీ వాస్తవంగా వేములవాడలో భీమేశ్వర ఆలయం ఉంది. అక్కడే భీమన తండ్రి పూజరిగా ఉండి ఉండవచ్చు అని చారిత్రక ఆధారాలతో చెప్పారు. భీమేశ్వర ఆలయం వేములవాడలో ఉన్న విషయాన్ని చెప్పకుండా కొంతమంది సాహిత్య చరిత్రకారులు ద్రాక్షారామంలోని భీమేశ్వర ఆలయాన్ని ప్రధానంగా వెలుగులోకి తెచ్చారు. సాహిత్య చరిత్రలో వివాదాస్పదంగా మిగిలిన ఈ అంశాన్ని సుజాతారెడ్డి ఈ సాహిత్య చరిత్ర ద్వారా పరిష్కరించారు.

**నన్నయయుగం - 11 వ శతాబ్దం:** అన్ని సాహిత్య చరిత్రలలో ప్రస్తావించిన అంశాలనే సుజాతా రెడ్డి నన్నయ యుగంలో వివరించారు. తూర్పు చాళుక్యులు నాలుగు, అయిదు శతాబ్దాల పాటు పరిపాలన చేసినప్పటికీ వారి కాలంలో తెలుగు, సంస్కృత భాషలలో సుప్రసిద్ధమైన రచనలు ఏవీ వెలువడలేదు. కానీ11వ శతాబ్దంలో రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి అయిన నన్నయ తెలుగులో కావ్యరచన చేశాడు. కుబ్జ విష్ణువర్ధనుని కాలంలో సంస్కృత కవి భారవి మనకు కనిపిస్తాడు. మొదటి చాళుక్య భీముని ఆస్థానంలో వామనుడు కనిపిస్తాడు. ఇతను శాసనకర్త మరియు పండితుడు. నన్నయ యుగంలో నన్నయ ప్రత్యేకతలు, అతని రచనలు, కవిత విశేషాలతో పాటు మహాభారతాన్ని ఆంధ్రీకరించిన విధానాలను అందులోని ప్రముఖ ఘట్టాలను ముదిగంటి సుజాతారెడ్డి వివరించారు.

**శివకవుల యుగం:** 12 వ శతాబ్దాన్ని సాహిత్యకారులు శివకవి యుగంగా పేర్కొన్నారు. ఈ కాలంలో ఎక్కువగా శైవ సాహిత్యం వెలువడింది. యుగకర్తగా పేర్కొనే ప్రధాన కవులు ఎవరు ఈ కాలంలో లేరని సుజాతారెడ్డి అభిప్రాయపడ్డారు. ఆ కాలంలో వచ్చిన సాహిత్యం మొత్తం శైవ మతానికి చెందినది. కాబట్టి ఆ సాహిత్యం ఆధారంగా ఈ యుగానికి 'శివకవియుగం' అని పేర్కొన్నట్లు వివరించారు

ఆ కాలంలోని చారిత్రక అంశాలను, రాజకీయ పరిణామాలను, కవుల గురించి వివరించారు. శ్రీపతి పండితుడు, శివలెంక మంచన, మల్లికార్జున పండితుడు, నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, చక్రపాణి రంగన, యథావాక్కుల అన్నమయ్య, కృష్ణమాచార్యులు వంటి కవుల వివరాలను, వారి రచనలను వివరిస్తూ, ఆ కాలంలో వెలువడిన శివకవుల కవితా వైశిష్ట్యం, దేశీ కవితోద్యమంతో పాటు భాష, ఛందస్సు, వస్తువు మొదలైన అంశాలను గురించి చర్చించారు. మొట్ట మొదట ద్విపద రామాయణం రాసిన తెలంగాణ కవి గోన బుద్ధారెడ్డి.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఈయన గురించి వివరిస్తూ రంగనాథ రామాయణ విశేషాంశాలను వివరించారు. బుద్ధారెడ్డిని కూడా యుగకర్తగా చెప్పే అవకాశం ఉన్నప్పటికీ అటువంటి ప్రస్తావన చేయలేదు. రంగనాథ రామాయణానికి ఆ పేరు రావడానికి గల కారణాలను చర్చించారు. అనంతరం హుళక్కి భాస్కరుని రచనలను, అతని జీవితాన్ని పరిచయం చేశారు.

**తిక్కన యుగం:** తిక్కన కాలానికి సంబంధించిన విషయాలను సాహిత్యకారులు పేర్కొన్న వాటినే ప్రస్తావించారు. కాకతీయుల కాలంలో తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒకే పరిపాలన కిందకి వచ్చినట్లు తెలుస్తుంది. తిక్కన 'ఆంధ్రావళి మోదం బొరయునట్లు'గా మహాభారతాన్ని రచిస్తాను అని పేర్కొన్నాడు. ఆంధ్రావళి అనగా ఆంధ్ర ప్రాంతంలోని ప్రజలందరూ అని అర్థం. అప్పటికే చిన్న చిన్న రాజ్యాలుగా ఉన్న తెలుగు ప్రజలు కాకతీయుల పాలనలో ఒకే రాజ్యం కిందికి వచ్చినట్లు తెలుస్తుంది. అందుకే తిక్కన ఈ పదప్రయోగాన్ని వాడినట్లు అర్థమవుతుంది. కేతన రచనలు దశకుమార చరిత్ర, ఆంధ్ర భాషా భూషణం, విజ్ఞానేశ్వరీయం, తిక్కన శిష్యుడైన మారన అనువాదం చేసిన మార్కండేయ పురాణానికి సంబంధించిన అంశాలను వివరించారు. తెలుగులోకి అనువాదం చేయబడ్డ తొలి పురాణం 'మార్కండేయ పురాణం'. దీనిని మారన(తెలంగాణ) అనువదించాడు మార్కండేయ పురాణాన్ని కాకతీయ రెండవ ప్రతాపరుద్రుని సేనాపతి నాగయ గన్ననికి అంకితం ఇచ్చిన విషయాల్ని వివరించారు.

**ఎర్రన యుగం:** కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుని మరణానంతరం కాకతీయ సామ్రాజ్యం అంతరించింది. తర్వాత దక్షిణ తెలంగాణలో రేచర్ల సింగమ నాయకుడు స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఉత్తర తెలంగాణ మరియు ఉత్తర తీరాంధ్రలో ముసునూరి ప్రోలయ నాయకుడు, దక్షిణతీరాంధ్రలో ప్రోలయ వేమారెడ్డి, విద్యానగరంలో హరిహర బుక్కరాయలు స్వతంత్ర సామ్రాజ్యాలు స్థాపించారు. విద్యానగరం అనంతర కాలంలో విజయనగరంగా మార్పు చెందింది. ఈ సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, అరవీటి వంశాలు పాలించాయి. చిన్న చిన్న సామ్రాజ్యాలను స్థాపించిన హరిహర బుక్కరాయలు రేచర్ల సింగమ నాయకుడు ముసునూరి, ప్రోలయ నాయకుడు, ప్రోలయ వేమారెడ్డి వంటి వారు కాకతీయ ప్రతాపరుద్రుని కొలువులో సేనానులుగా పనిచేశారు. ఎర్రన శివ భక్తుడు. రామాయణం, హరివంశం, నృసింహ పురాణం రచించాడు. ఎర్రన హరివంశం తర్వాత అరణ్యపర్వశేషాన్ని రచించాడు. ఎర్రనతోపాటు, నాచన సోమన, విన్నకోట పెద్దన వంటి కవుల వివరాలను, వారి రచనల గురించి చర్చించారు.

**శ్రీనాథ యుగం:** సంస్కృతంలో శ్రీహర్షుడు రాసిన 'నైషధీయ చరితం' ఆధారంగా శ్రీనాథుడు 'శృంగార నైషధం' కావ్యాన్ని రచించాడు. 'శృంగార నైషధం' కావ్యాన్ని మామిడి సింగనకు, సింగన యొక్క ముగ్గురు సోదరులకు కూడా తన కావ్యాలను అంకితం చేశాడని చెప్పారు. ఈ

అంకితాల ఆధారంగా శ్రీనాథుడు మంత్రి అయిన మామిడి సింగనకు అత్యంత సన్నిహితుడుగా ఉన్నట్లు తెలుస్తుంది. పెదకోమటి వేమారెడ్డి సంస్థానంలో చేరడానికి కొంత కాలంముందే 'శృంగార నైషదం' రచించినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తుంది. కొండవీడు సామ్రాజ్యం అంతరించిన తర్వాత శ్రీనాథుడు కంచి నగరానికి వెళ్లి అతని స్నేహితునికి అంకితమివ్వడం కోసం 'హరవిలాసం' రచించినట్లు తెలుస్తుంది. కంచి నగరం నుంచి విజయనగరం చేరుకుని ప్రౌఢదేవరాయల ఆస్థానంలో గౌడ డిండిమ భట్టును శాస్త్రవాదంలో ఓడించాడు. గౌడ డిండిమునికి వంశపారపర్యంగా, సాహిత్య చిహ్నంగా వచ్చిన కంచు ఢక్కను పగలగొట్టించాడు. అనంతరం ప్రౌఢదేవరాయల చేత కనకాభిషేకం చేయించుకున్నాడు. ఇటువంటి అంశాలతో పాటు శ్రీనాథుని రచనలను, ఆ రచనల యొక్క ప్రత్యేకతలను ముదిగంటి సుజాతారెడ్డి శ్రీనాథ యుగంలో చర్చించారు.

పోతన వరంగల్ నగరంలో ఉండి భాగవతాన్ని రచించినట్లు ప్రస్తావించారు. భాగవతంలోని పీటిక ద్వారా ఈ విషయాలు తెలుస్తున్నాయి. తెలంగాణ ప్రాంతంలో గోదావరిని ప్రజలు గంగ అని పిలుస్తారు. పీఠికలో వివరించిన అంశాల ప్రకారం పోతన ఒక చంద్రగ్రహణం రోజు గంగాస్నానం ఆచరించి తిరిగి వరంగల్ కు వచ్చి శ్రీరాముని ఆదేశానుసారం గురువు, బంధుజనుల కోరిక మేరకు భాగవతాన్ని రచించడం ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. పోతన రాయడానికి ఉపక్రమించింది వైష్ణవ మతానికి చెందిన గ్రంథం. గంగా స్నానం ఆచరించి రావడం అంటే వరంగల్ నగరానికి సమీపంలో ఉన్న ప్రాంతం ధర్మపురి. ధర్మపురిలోని గోదావరి లేదా గంగానదిలో స్నానమాచరించి వరంగల్ కు వచ్చిన తర్వాత తన రచనను ప్రారంభించి ఉండవచ్చునని సుజాత రెడ్డి మన తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంలో పేర్కొన్నారు.

ఈ అంశాలతో పాటు పోతన భాగవతాన్ని ఒక్కడే రాయలేదని 5, 6, 11, 12 స్కంధాలు తప్ప మిగిలిన ఎనిమిది స్కంధాలను పోతన రాసినట్లు ముదిగంటి సుజాతారెడ్డి చెప్పారు. పోతన వలె మొల్ల కూడా వీరశైవ మతానికి చెందిన వ్యక్తి. కానీ రామ భక్తిని పాటించినట్లు తెలుస్తుంది. మొల్ల తెలంగాణకు చెందిన కవయిత్రి అని సుజాతా రెడ్డి ప్రతిపాదించారు. 'ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్ర'లో కూడా మొల్ల ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉన్నట్లు చెప్పబడింది. పోతన తన కృతిని నరాంకితం చేయకుండా రాజులను నిరసించినట్లే మొల్ల కూడా చేసింది. "రామ నరపాలకుని స్తుతి సేయు జిహ్వకున్ చిల్లర రాజలోకమును జెకొని మెచ్చగా నిచ్చబుట్టునే"అనే వాక్యంలో 'చిల్లర' పదం వాడారు. ఈ 'చిల్లర' పదం తెలంగాణలో ప్రస్తుతం కూడా వాడుకలో ఉంది. చిల్లర దేశ్యపదం. శబ్దరత్నాకరంలో ఈ పదం ఉంది. తెలుగు నుండి సంస్కృతం లోకి ఈ పదం వెళ్ళింది. కాబట్టి ఈ ఆధారంతో మొల్ల తెలంగాణ ప్రాంత కవయిత్రి అని ముదిగంటి సుజాత రెడ్డి ప్రతిపాదించారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

శ్రీనాథుని సమకాలికుడైన పిల్లలమర్రి పినవీరన గురించి, అతని రచనలను అందులోని ప్రత్యేక అంశాలను వివరించారు, తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక తిమ్మక్క, నంది మల్లయ్య, ఘంటసింగన, దగ్గుపల్లి దుగ్గన వంటి వారి వివరాలు, వారి రచనలను ప్రస్తావించారు. గౌరన రాసిన నవనాథ చరిత్ర, హరిశ్చంద్రోపాఖ్యానం రచనల విశేషాలను, చారిత్రక అంశాలను వివరించారు. మడికి సింగన, కొరవి గోపరాజు, జక్కన, పంచతంత్ర కవులు, అనంతమాత్యుడు, కూచిరాజు ఎర్రన, వెన్నెల కంటి అన్నయ, రామభద్ర కవి, పాలవేకరి కదిరిపతి వంటి వారి రచనలను, అందులోని సాహిత్య అంశాలను ఈ యుగ సాహిత్యంలో చర్చించారు.

**<u>శ్రీకృష్ణదేవరాయల యుగం</u>:** ఈ యుగంలో శైవ మత సాహిత్య ప్రభావం తగ్గుతూ వైష్ణవ మత సాహిత్య ప్రభావం పెరగడం గమనించవచ్చు అని వివరించారు. ప్రబంధ కాలంలో ఎక్కువగా వైష్ణవ సాహిత్యమే మనకు కనిపిస్తుంది. సంగమ, సాళువ, తుళువ, అరవీటి వంశాల కాలాలలోని చారిత్రక, రాజకీయ అంశాలను ప్రస్తావించారు. విస్తృతంగా వెలువడ్డ ప్రబంధ వికాసాల గురించి చర్చించారు. ఈ యుగంలో వెలువడ్డ ప్రబంధాలలోని వస్తువు, వర్ణన, శైలి, అలంకారం, రస పోషణ, పాత్ర చిత్రణ, శిల్పం వంటి అంశాలను గురించి చర్చ చేశారు.

కృష్ణదేవరాయల రచన అయిన 'ఆముక్తమాల్యద' గురించి, కృష్ణదేవరాయలు సాహిత్యానికి అందించిన సేవలను, తెలుగు సాహిత్యం విలసిల్లిన విధానాలను వివరించారు. పెద్దన, ముక్కుతిమ్మన, ధూర్జటి, పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు, రామరాజభూషణుడు వంటి అష్టదిగ్గజ కవులు, వారు రాసిన రచనలు, అందులోని ప్రత్యేక అంశాలను సుజాతారెడ్డి ఈ యుగ సాహిత్యంలో ప్రస్తావించారు. కృష్ణదేవరాయల పాలనలో తెలుగు, కన్నడ, తమిళ ప్రాంతాలు ఉన్నాయి. కాబట్టి అతని ఆస్థానంలో కేవలం తెలుగు కవులే కాక కన్నడ, తమిళ సాహిత్యానికి సంబంధించిన కవులు ఉండి ఉండవచ్చు అని అభిప్రాయపడ్డారు.

**<u>కుతుబ్ షాహీ యుగం</u>:** విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత తెలంగాణ ప్రాంతంలో కుతుబ్ షాహీ వంశ పాలన ప్రారంభమైంది. పాలకులు ఉర్దూ భాషకు చెందినవారు అయినప్పటికీ పారసీ, ఉర్దూ, తెలుగు కవులను ఆదరించారు. ఇబ్రహీం కుతుబ్ షా కొంతకాలం పాటు విజయనగర సామ్రాజ్యంలో ఉండడం వలన తెలుగు సాహిత్యంపై మక్కువ ఏర్పడి ఉండవచ్చని అనిపిస్తుంది. కుతుబ్ షాహీల పరిపాలనలో హైదరాబాదు రాష్ట్ర భూభాగం కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో కలిసి ఉంది. అందువల్ల ఈ మూడు భాషల కలయిక ఆధారంగా దక్కని లేదా దక్కన్ పేరుతో ఒక విశిష్టమైన ప్రత్యేకత కలిగిన భాష ఏర్పడింది. ముదిగంటి సుజాతారెడ్డి శ్రీకృష్ణదేవరాయల కాలం తెలుగు సాహిత్యంలో 'స్వర్ణ యుగం' అయితే కుతుబ్ షాహీల కాలం తెలంగాణ సాహిత్యంలో స్వర్ణయగం వంటిదని అభిప్రాయపడ్డారు.

అద్దంకి గంగాధరుడు, పొన్నగంటి తెలగన వంటి కవులు కుతుబ్ షాహీ పాలకులకు, వారి మంత్రులకు తమ కావ్యాలను అంకితం చేయడం గమనించవచ్చు. ఈ కాలం కన్నా ముందు వరకు ఇతర మతస్థులకు ఎవరు కావ్యాలను అంకితం చేయలేదు. ఈ యుగం నుండే మనకు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఆ ప్రత్యేకత కన్పిస్తుంది. అంతేకాక గోల్కొండ సుల్తానుల కాలంలో కరణంగా పనిచేసిన సారంగు తమ్మయ్య వైజయంతి విలాసం అనే శృంగార ప్రబంధాన్ని రాశాడు. చెరిగొండ ధర్మన్న, మల్లారెడ్డి, సురభి మాధవ రాయలు, కంచర్ల గోపన్న లేదా రామదాసు వంటివారు గొప్ప సాహిత్యాన్ని కుతుబ్ షాహీల కాలంలో అందించారు. ఇంతకు ముందు సాహిత్య చరిత్రలలో ప్రస్తావించబడని చాలా విషయాలను సుజాతారెడ్డి 'మన తెలుగు సాహిత్య చరిత్ర'లో వివరించారు.

**రఘునాథ నాయకుని యుగం:** పింగళి లక్ష్మీకాంతం యుగ విభజన ప్రకారం 'దక్షిణాంధ్ర యుగం'గా (పిలువబడుతున్న 17, 18 శతాబ్దాల తెలుగు సాహిత్య చరిత్ర కాలాన్ని) సుజాతారెడ్డి రఘునాథ నాయక యుగంగా పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయల వలె రఘునాథ నాయకుడు కవి, పండితుడు మరియు కవి పండిత పోషకుడు. కాబట్టి ఆయన కాలాన్ని దక్షిణాంధ్ర కాలానికి మారుపేరుగా సూచించినట్లు వివరించారు. రఘునాథ నాయకుని కాలంలో ప్రబంధం, కథ, ద్విపద కావ్యాలు, యక్షగానాలు, పదరచనలు, అభ్యుదయ కావ్యాలు, చిత్ర కవిత్వం, ద్వర్థి కావ్యాలు మొదలైనవి ఆవిర్భవించాయి. రఘునాథ నాయకుని ఆస్థానంలో రామభద్రాంబ, మధురవాణి అనే కవయిత్రులు ఉండేవారు. అప్పటివరకు స్త్రీలు ఆస్థానాలలో ఉన్నట్లు సాహిత్యంలో మనకు కనిపించదు. మొల్ల అనే కవయిత్రి మాత్రమే కాకతీయ రాజైన చివరి ప్రతాపరుద్రుని కాలంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ యుగంలో దక్షిణాంధ్ర యుగ విషయాలను, వచన కావ్య రచనను వివరించారు. 1847వ సంవత్సరంలో త్యాగయ్య మరణం వరకు రఘునాథ నాయకుని యుగంగా పేర్కొన్నారు.

**వీరేశలింగం యుగం:** ఆధునిక యుగంగా సాహిత్యకారులు వీరేశలింగం కాలాన్ని పేర్కొన్నారు. ఈ యుగ కాలాన్ని 1. పునరుజ్జీవనం, 2. పందొమ్మిదో శతాబ్దం పూర్వార్థం, 3. పందొమ్మిదో శతాబ్దం ఉత్తరార్ధంగా వర్గీకరణ చేశారు. ఈ విధంగా వర్గీకరణ చేసినప్పటికీ అందరు సాహిత్యకారులు పేర్కొన్న అంశాలనే ప్రస్తావించారు.

**1. పునరుజ్జీవనం**

క్రీ. శ 18, 19వ శతాబ్దాలలో విదేశాలలో సాంకేతిక అభివృద్ధి ప్రారంభమైంది. కొత్త కొత్త ఆవిష్కరణలు ప్రారంభమయ్యాయి. రైల్వే, టెలిగ్రాఫ్, తపాలా శాఖ వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. భారత దేశంలో సామాజిక, మత సంస్కరణలు ప్రారంభమయ్యాయి. ఆంగ్ల విద్య మనదేశంలోకి ఈ సమయంలోనే ప్రవేశించింది. వీరశలింగం, రఘుపతి వెంకయ్య నాయుడు వంటివారు సంఘ సంస్కరణ కోసం కృషి చేశారు. వ్యావహారిక భాష అవసరాన్ని గుర్తించారు. నవల, వ్యాసం, ప్రహసనం, కథ, నాటిక, ఖండకావ్యం లాంటి కొత్త ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో ప్రారంభమయ్యాయి. తెలుగులో అచ్చు యంత్రాలు ప్రారంభం అయ్యాయి. మెకంజీ, సి. పి. బ్రౌన్, ఏ. డి క్యాంబెల్, కాల్డ్వెల్ వంటివారు సాహిత్య పరిశోధనలకోసం కృషి చేశారు. కావలి బొర్రయ్య, కావలి వెంకట

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

రామస్వామి సోదరులు ఏర్పాటు చేసిన మార్గం సాహిత్య చరిత్ర నిర్మాణానికి అంకురార్పణ చేసింది.

**2. పందొమ్మిదో శతాబ్దం పూర్వార్ధం**

పందొమ్మిదో శతాబ్దం పూర్వార్ధంలో సంస్థానాధీశులు కవులను ఆదరించారు. రాజకీయంగా నిరాశపూరిత వాతావరణం ఉండడం వలన సాహిత్యం ఎక్కువగా రాలేదు. పాలకులకు వ్యతిరేకంగా తిట్టు కవిత్వం, అధిక్షేప శతకం వంటి రచనలు వచ్చాయి. గద్వా ల,వనపర్తి, ఆత్మకూరు, కొల్లాపూర్, దోమకొండ, పిఠాపురం, పెద్దాపురం, విజయనగరం, బొబ్బిలి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, నూజివీడు, అమరావతి, నరసరావుపేట, చల్లపల్లి వంటి సంస్థానాలు కవులను ఆదరించి సాహిత్యాభివృద్ధికి కృషి చేశాయి.

ఈ సంస్థానాలలో ఏనుగు లక్ష్మణకవి, కూచిమంచి తిమ్మకవి, కూచిమంచి జగ్గకవి, పుష్పగిరి తిమ్మన, కంకంటి పాపరాజు, కనుపర్తి అబ్బయామాత్యుడు, పిండిప్రోలు లక్ష్మణకవి, అడిదం సూరకవి, గోపీనాథ వేంకటకవి, కుమార ధూర్జటి, దిట్టకవి నారాయణకవి, కాసుల పురుషోత్తమ కవి, కాణాదం పెద్దన సోమయాజి, ఎలకూచి బాలసరస్వతి మొదలయిన కవులున్నారు.

**3. 19వ శతాబ్దం ఉత్తరార్ధం:** 19వ శతాబ్దం ఉత్తరార్ధం సమయంలో కవి పండితులు విదేశీ పరిపాలన గుర్తించినట్లు కనిపించదు. ఈ కాలంలో సంస్కృత సాహిత్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ విభాగంలో ముదిగంటి సుజాతారెడ్డి కేవలం కవులను, వారి రచనలను, కాలాన్ని మాత్రమే పరిచయం చేస్తూ వివరించారు. బహుజనపల్లి సీతారామాచార్యులు, కోరాడ రామచంద్ర శాస్త్రి, మల్లినృసింహ కవి, మండపాక పార్వతీశ్వర శాస్త్రి, వావిలాల వాసుదేవ శాస్త్రి, గురజాడ శ్రీరామమూర్తి, ఆదిభట్ల నారాయణదాసు, వడ్డాది సుబ్బరాయ కవి, వేదం వెంకటరాయ శాస్త్రి, ధర్మవరం కృష్ణమాచార్యులు, పానుగంటి లక్ష్మీనరసింహారావు, దాసుశ్రీరామ కవి, తిరుపతి వెంకట కవులు, దేవులపల్లి సోదరులు, బాలాంత్రపు, వెంకట్రావు, ఓలేటి పార్వతీశం, పింగళి లక్ష్మీకాంతం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, గిడుగు వెంకట రామమూర్తి, జయంతి రామయ్య పంతులు, వేటూరి ప్రభాకర శాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, మానవల్లి రామకృష్ణ కవి, కట్టమంచి రామలింగారెడ్డి వంటి వారి రచనలను, వివరాలను అందించారు.

<u>**కృష్ణ శాస్త్రి యుగం:**</u> ఈ యుగాన్ని 1. నవ్య కవిత్వం, 2. రోమాంటిసిజం, 3. భావకవిత్వం లక్షణాలు అని మూడు విభాగాలుగా వర్గీకరించి ఆ కాలంలోని సాహిత్యాన్ని పరిచయం చేశారు. తెలుగు సాహిత్యంలో నవ్యత వీరేశలింగం కాలం నుండే ప్రారంభమయ్యింది. 1850 తర్వాత వచ్చిన కవిత్వం నవ్య సాహిత్యం కిందికి వస్తుంది. పాశ్చాత్యుల హేతువాదం, కాల్పనిక వాదం 19, 20వ శతాబ్దాలలో భారతదేశంలో ప్రవేశించాయి. భారతీయుల జీవిత విధానంలో, మత, సామాజిక, రాజకీయ, విద్యా, పరిపాలనా రంగాల్లో ఆధునిక ధోరణులు

వచ్చాయి. ఇవి సాహిత్యంలో నవ్యతను తెచ్చాయి. కందుకూరి, గురజాడ, గిడుగు భాషా సంస్కరణోద్యమాలు సాహిత్య ధోరణుల్లో నవ్యతను తెచ్చాయి. ఆత్మాశ్రయ రీతి, వాస్తవిక వాదం, కాల్పనిక వాదం, అభ్యుదయ వాదం, హేతువాదం నవ్య కవితోద్యమం పేరుతో వ్యాప్తిలోకి వచ్చాయి.

కురుగంటి సీతారామయ్య, పిల్లలమర్రి వేంకట హనుమంతరావులు 1942-49 మధ్య నవ్యాంధ్ర సాహిత్య వికాసాన్ని వివరిస్తూ నాలుగు భాగాలుగా "నవ్యాంధ్ర సాహిత్య వీధులు" అనే గ్రంథాలను రచించారు. తెలుగు సాహిత్యంలో వచ్చిన (1850-1950) మార్పులను నూతన ప్రక్రియలను వివరించారు. 1949లో ఇది ఒక సంపుటంగా అచ్చయింది. నండూరు సుబ్బారావు, నాయిని సుబ్బారావు, వేదుల సత్యనారాయణ, బసవరాజు అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, నోరి నరసింహ శాస్త్రి, తుమ్మల సీతారామశాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువ, వానమామలై వరదాచార్యులు, పుట్టపర్తి నారాయణచార్యులు, జంధ్యాల పాపయ్య శాస్త్రి వంటి వారి వివరాలు, రచనలను పరిచయం చేశారు. దేశోద్ధారక గ్రంథమాల వంటి ప్రచురణ సంస్థలు తక్కువ ధరకు పుస్తకాలు అందించి, సాహిత్యాన్ని ప్రజలకు చేర్చాయి. తెలంగాణలోను సామాన్యులకు అర్థమయ్యే భాషలోనే కవులు రచయితలు రచనలు చేసారు. అ విధంగా ప్రక్రియల్లో, భాషలలో తెలంగాణ సాహిత్యంలో నవ్యత సాధింపబడింది. కృష్ణశాస్త్రి యుగంలో కాల్పనికవాదం ప్రబలంగా ఉండి భావకవిత్వమనే పేరుతో ఆత్మాశ్రయ కవిత్వం, వస్త్వాశ్రయకవిత్వం రెండూ వచ్చాయి. నవలలు, కథానికలు, నాటికలు, ఏకాంకికలు, వ్యాసాలు, పాట మొదలయిన ప్రక్రియలెన్నో సాహిత్యంలో ప్రచారాన్నందుకున్నాయి. ఈ ప్రక్రియలన్నిటిలో వస్తువు, భాష, ఛందస్సు భావం అన్నింటిలో నవ్యత సాధింపబడింది

**శ్రీ శ్రీ యుగం:** 1926 30 మధ్య కాలంలో తెలుగు సాహిత్యంలో అభ్యుదయ భావాలు, సిద్ధాంతాలు ప్రవేశించాయి. శ్రీశ్రీ తన కవిత్వంలో చక్కని సంస్కృత పదాలను, సమాసాలను ప్రయోగించి భావావేశం ప్రకటించాడు. తాళ్ళూరి నాగేశ్వరరావు, గోపీచంద్, కరుణకుమార, మునిపల్లె రాజు మొదలయిన వాళ్ళు కథానికలు రచించారు. నాజర్ బుర్రకథలకు ప్రసిద్ధుడైనాడు. సుంకర "మా భూమి" నాటకం చాలా ప్రదర్శనల నందుకున్నది. ఆత్రేయ, రాజమన్నారు నార్ల వేంకటేశ్వర రావు వంటి వాళ్ళు తెల్లవారేంత వరకు ప్రదర్శించే నాటకాలు కాక, కొన్ని గంటలకు పరిమితమైన నాటకాలు, నాటికలు రచించారు. బుర్ర కథలు నాటకం తెలంగాణలో సామాన్య ప్రజల కష్టాలను, రైతులమీద శిస్తు, లెవీధాన్యం వసూళ్ళ సమయంలో జరిగే అత్యాచారాలను, దోపిడీలను గురించి చెప్తున్నాయి. తెలంగాణలోని అభ్యుదయ సాహిత్యం నిజంగా జరిగిన పరిస్థితులనుంచి ఆచరణరూపంలో వచ్చింది. తెలంగాణేతర ప్రాంతంలో అభ్యుదయ సాహిత్యం కేవలం పుస్తకాలు చదవటం నుంచి

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

వచ్చింది. ఆ భేదం మనకు రెండు ప్రాంతాల అభ్యుదయ సాహిత్యాల పరిశీలనలో కన్పిస్తుంది.

**అభ్యుదయానంతర ధోరణులు – వాదాలు:** ఈ విభాగంలో దిగంబర కవులు నవ్య సంప్రదాయవాదం చేతనావర్త కవులు, అనుభూతి కవులు తిరగబడు కవులు అని విభజించి, ఆయా వాదాలలోని అంశాలను చర్చించారు. రాజకీయ నాయకుల స్వార్థ దోపిడీలు, ఆర్థిక సంక్షోభం, అవినీతిని ప్రతిఘటిస్తూ దిగంబరకవులు తమ కవిత్వం ద్వారా అసంతృప్తిని ప్రకటించారు. దీని ద్వారా సమాజంలో, సాహిత్యంలో స్తబ్ధతను బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు. దిగంబర కవులు తాము రాసిన కవిత్వాన్ని మూడు కవిత సంపుటాలుగా ప్రచురించారు. తమ కవితా ఖండికలను దిక్ అని పిలవాలన్నారు. నగ్నముని, నిఖిలేశ్వర్, చరబండ రాజు, జ్వాలాముఖి, మహా స్వప్న, భైరవయ్య అనే ఆరుగురు దిగంబర కవిత్వానికి ప్రధాన భూమికగా ఉన్నారు. నవ్య సంప్రదాయ వాదం భావ కవిత్వ కాలం నుంచి ఉంది కాబట్టి దీనికి ఒక కాల నిర్ణయం చేయడానికి వీలులేకుండా ఉందని సుజాత రెడ్డి అభిప్రాయపడ్డారు.

నవ్య సంప్రదాయవాదంలో సాహిత్య కావ్య సృజన విమర్శలు కనిపిస్తున్నాయి. దుర్భాక రాజశేఖరకవి, గడియారం వేంకటశేషశాస్త్రి, వానమామలై వరదాచార్యులు వస్తువులో నవ్యతను, భావాల్లో ఆధునికతను ప్రదర్శిస్తూ మహాకావ్య రచనలు చేసారు. పద్యరచనను చేపట్టి వస్తు నవ్యతతో తుమ్మల సీతారామమూర్తి కరుణశ్రీ, ఇంద్రగంటి ఖండకావ్యాలు రాసారు. 1967లో "చేతనావర్తకవులు" అయిన పేర్వారం జగన్నాథం, కోవెల సంపత్కుమార, కోవెల సుప్రసన్న నరసింహారెడ్డి అనే నలుగురు కవుల్లో నవ్య సంప్రదాయ ఛాయలున్నాయి. దేవులపల్లి రామానుజ రావు, పల్లాదుర్గయ్య, ఉత్పల సత్యనారాయణాచార్యులు, బోయి భీమన్న మొదలైన కవులెందరో నవ్య సంప్రదాయంలో పద్యరచన చేశారు. “సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు" గ్రంథంలో జి.వి.సుబ్రహ్మణ్యం నవ్య సంప్రదాయాన్ని గురించి చాలా చర్చించారు. నవ్య సంప్రదాయం స్వరూప స్వభావాలను నిర్దేశించారు. నవ్య సంప్రదాయాన్ని ముందుకు తెచ్చిన వాళ్ళల్లో కోవెల సుప్రసన్నాచార్య, జి.వి. సుబ్రహ్మణ్యం ప్రముఖులు. చేతనావర్త కవులు, అనుభూతి కవులు, తిరగబడు కవుల సాహిత్య అంశాలను ఈ విభాగంలో చర్చించారు.

**విప్లవ వాదం:** భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి అంతగా జరుగక పోగా 1960-67లో పారిశ్రామిక రంగంలో స్తబ్ధత ఏర్పడింది. ఆర్థికంగా సంక్షోభం, ద్రవ్యోల్బణం ఏర్పడింది. అమెరికా తన పెట్టుబడులతో అప్పుల రూపంగాను మన దేశంలోకి ప్రవేశించింది. వలస సామ్రాజ్యవాదం స్థానంలో కొత్త సామ్రాజ్యవాదం ప్రారంభమైంది. ప్రపంచ బ్యాంకు అప్పులతో దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యలకు పూనుకుంది.

ఈ పరిస్థితుల్లో విద్యార్థుల్లో, నిరుద్యోగులైన యువకుల్లో అశాంతి ప్రవేశించింది. విద్యార్థుల ఆందోళనలు పెరిగాయి. ఆ తరుణంలో నక్సల్బరీ సాయుధ పోరాటం వాళ్ళనాకర్షించింది.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఎంతో మంది యువకులు తమ ఉన్నత విద్యను విడిచిపెట్టి పోరాటంలో చేరిపోయారు. 1969 ఏప్రిల్ 22వ తేదీన నాడు లెనిన్ జయంతి రోజు మార్క్సిస్ట్ లెనినిస్టు పార్టీ అవతరించింది. భూస్వాముల పెట్టుబడిదారుల చేతుల్లో రాజ్యాధికారం ఉందని, దున్నేవానికే భూమి కావాలని, వ్యవసాయ విప్లవం, ప్రజా విప్లవం రావాలని, దీర్ఘకాలిక సాయుధ పోరాటంతో అది సాధింపబడుతుందని పార్టీ తీర్మానం జరిగింది.

1970 మే నెలలో కలకత్తాలో జరిగిన పార్టీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి కొందరు పాల్గొన్నారు. విప్లవకవుల మొదటి కవితా సంకలనం 'ఝంఝ' విరసం మొదటి మహాసభల నాటికే ఆ వచ్చింది. ఇది శ్రీకాకుళ గిరిజనోద్యమంలో మరణించిన సుబ్బారావు ప్రాణిగ్రాహి స్మృతికి - అంకితమియ్యబడింది. ఆ తర్వాత “మార్చ్"లే' అనే కవితా సంపుటాలు వెలువడినాయి. వాటిని ప్రభుత్వం దేశద్రోహకరమని నిషేధించింది. దానిలోని కవితలు యువకులను విప్లవ కవిత్వంవైపు ఆకర్షింపచేశాయి. అన్యాయాలను ఎదిరిస్తూ సాయుధ పోరాటాన్ని సమర్థిస్తూ యవకులు ఆవేశంతో కూడిన కవితలు రాశారు.

**విప్లవానంతర ధోరణులు – అస్తిత్వ వాదాలు:** ఈ విభాగంలో మినీ కవిత్వం, స్త్రీ వాదం, దళిత వాదం, ముస్లిం మైనారిటీ వాదాలలోని ప్రధాన అంశాలను చర్చించారు. 1974లో మినీ కవిత్వం ప్రారంభమయ్యింది. పత్రికల్లో కార్టూన్లతో మినీ కవితలు ప్రచురించబడ్డాయి. మినీ కవిత్వాన్ని గురించి 1980లో రావి రంగారావు, అద్దేపల్లి రామ్మోహనరావులు పరిశీలనాత్మక వ్యాసాలు రాసారు. జి.వి. పూర్ణచందు, అలిశెట్టి ప్రభాకర్లు చిత్రాలను వేసి మినీ కవితలను ప్రదర్శించారు. వచన కవిత్వంలో భాగంగానే ‘అల్పాక్షరంలో అనల్పార్థ రచన’గా మినీ కవిత ఆవిర్భవించింది. సంక్షిప్తత, చమత్కారం, వ్యక్తీకరణలో సూటిదనం, కొత్తదనం, హాస్యవ్యంగ్యం, భావ గాంభీర్యం, కొసమెరుపులు మినీ కవిత లక్షణాలు. మొదట్లో ముస్లిం వేదన దళిత బహుజన వాదంలో భాగంగానే వ్యక్తమైంది. రాను రాను ముస్లిం రచయితలు ఎక్కువ సంఖ్యలో తమ బాధలు సమస్యలు, వివక్షలను తమ సంస్కృతి నేపథ్యంలో వ్యక్తీకరించటంతో ముస్లిం మైనారిటీ వాదం స్వతంత్ర రూపం ధరించింది.

మైనారిటీ వాదం మొదట 'జల్ జలా, అజా, గుజరాతు గాయం' వంటి కవితా సంకలనాల్లో ప్రకటితమైంది. తర్వాత స్కైబాబా సంపాదకత్వంలో వచ్చిన 'వతన్' కథా సంకలనంలో ప్రకటితమైంది. ముస్లిం సమాజంలో ఉండే పర్దా, తలాఖ్ వంటి దురాచారాలను విమర్శించారు. ముస్లింల మీద జరిగే అన్యాయాలను, వివక్షతలను ప్రశ్నించారు. స్త్రీల అణచివేతలను, గృహ హింసలను చిత్రించారు. ముస్లింల పేదరికాన్ని, నిరక్షరాస్యతను, నిరుద్యోగుల వేదనను రాసారు. వాళ్ల జీవిత విధానాలు, ఆచారాలు, వ్యవహారాలు వాళ్ళ రచనల్లో ప్రతిబింబిస్తున్నాయి

**స్త్రీ వాదం:** స్త్రీ వాద సాహిత్యంలో ప్రేమ వివాహాలు, వర్ణాంతర వివాహాలు వంటి ఇతివృత్తాలతో నవలలు, కథలు రాశారు కానీ అదే సమయంలో యూరప్ లో తలెత్తిన స్త్రీ

వాదాన్ని పట్టించుకోలేదు అన్నారు. భావ కవులు, కాల్పనిక యుగంలోని రచయితలు స్త్రీని, స్త్రీ సమస్యలను పట్టించుకున్నంతగా అభ్యుదయ కవులు, దిగంబర కవులు పట్టించుకోలేదు అని విమర్శ చేశారు సుజాతా రెడ్డి. స్త్రీవాద సాహిత్యం లో వచ్చిన రచనలను, వాటిలోని విషయాలను పేర్కొన్నారు. చాలా వరకు స్త్రీవాద సాహిత్యం స్త్రీ శారీరక, మానసిక హింసలను గురించి రాశారు కానీ వ్యక్తిత్వం గురించి రాయలేదని అభిప్రాయపడ్డారు. స్త్రీవాద రచయిత్రులు స్వేచ్ఛ గురించి రాశారు. కానీ, స్త్రీ వ్యక్తిత్వం ఆత్మ వికాసం గురించి ఎవరు పట్టించుకోలేదు అని రాశారు **చలం** ప్రేమ గురించి రాశాడు కానీ ఇష్టమైన పురుషుణ్ణి ప్రేమించిన స్త్రీ మైదానంలో కాపురం పెట్టినట్లుగా అరుణ పాత్ర ద్వారా స్త్రీ జీవితాన్ని చూపించారని తెలిపారు. ప్రపంచీకరణ, వ్యాపార ధోరణులు స్త్రీ వాదాన్ని బలహీనపరిచినట్లు వివరించారు.

**<u>దళిత వాదం:</u>** దళిత సాహిత్యం వ్యక్తి అనుభూతిని కాకుండా సామూహిక అనుభూతిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. దళిత సాహిత్య అకాడెమీల ఏర్పాటు, దళిత రచయితల గురించి చర్చించారు. దళిత సాహిత్యంలో వచ్చిన పరిణామ వికాసాలను వివరించారు. దళిత సాహిత్యం కులాల మీద విద్వేషం ప్రకటించేదిగా కాకుండా కుల నిర్మూలన వైపు ఉద్యమాన్ని సాగించాలని చెప్పారు. బహుజనులు సంస్కృత భాషను బ్రాహ్మణ వాదానికి చిహ్నంగా భావిస్తున్నట్లు చెప్పారు. సంస్కృత భాషను నిరసిస్తూ గంగపుత్ర, వంశ రాజు, సగర పుత్ర, వాల్మీకులు అని కులం పేర్లను సంస్కృతీకరించుకుంటున్నారు అనీ విమర్శ చేశారు.

**ప్రపంచీకరణం – వ్యాపారయుగం – అత్యాధునిక ధోరణులు:** ప్రాచీన కాలంలో మనిషికి, దైవానికి మధ్య పారిశ్రామికీకరణం తర్వాత భావ కవిత్వంలో మనిషికి, ప్రకృతికి మధ్య, అభ్యుదయ యుగంలో మనిషికి, సమాజానికి మధ్య సామరస్యం కలిగించే ప్రయత్నం జరిగింది. ఇప్పుడు ఈ మార్కెట్ యుగంలో యాంత్రీకరణంలో మనిషికి, యంత్రానికీ మధ్య సామరస్యం కలిగించే ప్రయత్నం జరుగుతున్నది. 18వ శతాబ్దంలో రాజు మరణించాడు. 19వ శతాబ్దంలో దేవుడు మరణించాడు, 20వ శతాబ్దంలో మనిషి మరణిస్తున్నాడు అని వివరించారు.

మనిషి మరణించి యంత్రం బలపడుతున్నది వ్యాపార ప్రపంచంలో మనిషికి ఆర్థికం తప్ప వేరే ఏమీ కన్పించడం లేదు. మార్పు అంతా ఆర్థికం మీదనే ఆధారపడిందన్న సత్యం ఈ యుగంలో నిజమైంది. మానవ విలువలకు స్థానం లేదు. ఆ ఆవేదన నుంచే తమ అస్తిత్వాన్ని ప్రకటించే సాహిత్యం వస్తుంది. ప్రతి ప్రాంతం, దేశం తమ భాష, యాసల్లో, సంస్కృతి నేపథ్యంలో తమ మూలాలను ఉనికిని బాధలను వేదనలను చాటుకుంటున్నారు. ఒక ప్రాంతం వాళ్ళు మరో ప్రాంతంమీద కూడా సామ్రాజ్యవాద పెత్తనం చలాయిస్తున్నారని తెలంగాణా కవులు, రచయితలు, మేధావులు తమ మీద జరిగే అధికార

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

పెత్తనాలను, దోపిడీని నిరసిస్తూ తీవ్రంగా స్పందించారు. ఈ తీవ్ర స్పందన తెలంగాణా ప్రాంతీయ అస్తిత్వవేదన బలంగా రావడానికి కొన్ని ప్రత్యేక చారిత్రక, సామాజిక, రాజకీయ కారణాలు పనిచేశాయి. ప్రజలు తమ భాష, సంస్కృతి సంపదల మీద జరిగే వివక్షతకు, దోపిడీకి స్పందించారు. తిరుగుబాటు చేసారు. కవులు, రచయితలు ఆవేశంతో పాటలు, కవిత్వం, కథలు వ్రాసారు.

సుజాతారెడ్డి రాసిన 'చారిత్రక సామాజిక నేపథ్యంలో ‘మన తెలుగు సాహిత్య చరిత్ర’ గ్రంథం తెలుగు సాహిత్యంలో ఒక స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్రగా గుర్తించవచ్చు. సంస్కృత సాహిత్యానికి సంబంధించి తెలుగులో వచ్చిన అతి తక్కువ సాహిత్య చరిత్రల్లో ముదిగంటి సుజాతారెడ్డి రచించిన 'సంస్కృత సాహిత్య చరిత్ర' మంచి స్థానాన్ని కలిగి ఉంది.ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమ ప్రభావం వల్ల ఏర్పడిన పరిస్థితులు ప్రాంతీయ సాహిత్య చరిత్రలు రావడానికి గల బలమైన నేపథ్యాన్ని అందించాయి.ఇప్పటివరకు వచ్చిన సాహిత్య చరిత్రలన్నీ కవుల చరిత్రలుగా, సంగ్రహ చరిత్రలుగా, కవి జీవితాలుగానే వచ్చాయి. సుజాతారెడ్డి రాసిన 'చారిత్రక సామాజిక నేపథ్యంలో సాహిత్య చరిత్ర' గ్రంథంలో సాహిత్యాన్ని, సమాజాన్ని రెండింటిని సమన్వయం చేస్తూ సమాజంలో జరిగే రాజకీయ, చారిత్రక, సామాజిక మార్పులకనుగుణంగా మొదటిసారిగా సాహిత్య చరిత్రను నిర్మించారు.

**ఆధార గ్రంథాలు:**

1. సుజాతారెడ్డి, ముదిగంటి. 2015. ***తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: సాయి లిఖిత ప్రింటర్స్

2. మారుతి, శ్రీపతి. 2023. ***ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ ధోరణులు – పరిశీలన***. దార్ల వెంకటేశ్వర రావు పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం

3. సూర్యకుమారి, ఎస్.వి. 1989. ***తెలుగులో సాహిత్య చరిత్రలు***. జి. వి. సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన ఎం. ఫిల్ పరిశోధన వ్యాసం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.